## పెద్ద కథ

## 2

తోలేటి జగన్మోహనరావు

బ్రదర్‌ని చూస్తే ఇంత పిచ్చాడు లోకంలో ఎలా బతుకుతాడా అని జాలేసింది. బట్టలు అందుకుని, రెండు బ్యాగ్‌లూ లోపల బావగారి గదిలో భద్రవరుస్తుంటే నా ప్యాంటులోంచి రెండు పర్సులు పడ్డాయి.

'ఇదేవిట్రా, మన పర్సు పిల్లల్ని పెట్టిందేవిటి' అని ఆశ్చర్యపోతుంటే, అది బ్రదరు పర్సు అయివుండొచ్చు అనిపించింది.

బ్రదర్ స్నానం చేసొచ్చాక ఇవ్వొచ్చులే అనుకొని పర్సు బ్యాగ్‌లో పెట్టి హాల్లోకి వస్తుండగా కరెంటు పోయింది.

"బ్రదర్", కరెంటు పోగానే తెలివొచ్చి తన కేసి కంగారుగా చూసుకుని కెవ్వుమన్నాడు బ్రదర్, "నా ప్యాంటూ, షర్టూ ఏవీ?"

"నువ్వూ స్నానం చేసిరా తమ్ముడూ! భోంచేద్దువుగాని. బావగారెప్పుడొస్తారో." కొవ్వొత్తి తీసుకుని వస్తూ అంది సిస్టరు బ్రదరుతో.

"త్వరగా రా! భోంచేద్దాం" అన్నాను.

"నువ్విప్పుడే కదా భోంచేశావు" అన్నాడు బ్రదర్.

"చేశానా! మర్చిపోయాను. మీ పిచ్చి నాకు కూడా అంటుకున్నట్టుంది. అన్నట్టు బ్రదర్‌కి వాసాల సెంటిమెంటు - భోంచెయ్యడు" అన్నాను సిస్టరుతో.

"వాసాల సెంటిమెంటేవిటి?" అంది సిస్టరు.

"వైష్ణవదేవి వ్రతంలా అదో వ్రతం అనుకుంటా..."

"పోనీ పూరీలు చేస్తా..."

"పూరీలు చెయ్యి - బంగాళాదుంపల కూర కూడా చెయ్యి. బ్రదర్ తిన్నా తినకపోయినా నేను తింటా" అన్నాను హుషారుగా. పూరీ - బంగాళాదుంపల కూర సిస్టరు స్పెషాలిటీ. ఇంతలో గేటు దగ్గర స్కూటరాగిన చప్పుడయింది. "మీ బావగారొచ్చినట్లున్నారు" అంటూ సిస్టరు గేటు తలుపులు తియ్యడానికి వెళుతుంటే, గాలి విసురుకి కొవ్వొత్తి ఆరిపోయి అంధకారమైంది.

"ఎవరొచ్చారు? మాటలు విన్పిస్తున్నాయి" అనడిగారు బావగారు లోపలకు వస్తూ.

"మా పిన్నిగారబ్బాయి - సత్యం."

""ఆ మెంటల్ కేసా?" అన్నారు బావగారు చిరాగ్గా.

"మీ మేనత్తగారబ్బాయి. రాజమండ్రిట. అతను కూడా వచ్చాడు సత్యంతో" అంది సిస్టరు. బ్రదర్ నాతో రాలేదు. విడిగా వచ్చాడు. కానీ, సిస్టరు అలవాటుగా అన్నీ కలగావులగం చేసి చెప్తోంది.


"మా మేనత్తగారబ్బాయేవిటి? రాజమండ్రి ఏవిటి? నాకసలు మేనత్తలే లేరు."

"వేలు విడిచిన మేనత్తేమో..."

"వేలు విడిచిన మేనత్తలూ

చిత్రాలు: నర్సిం





లేరు. వేలువిడవని మేనత్తలూ లేరు. ఈ మెంటల్‌గాడు ఎవణ్ణి వట్టుకొచ్చాడో...''

బ్రదర్‌ని చూస్తే మిస్టరీ మంచులా విడిపో తుందని బాత్రూం దగ్గరకి తడుముకుంటూ వెళ్ళి, "బ్రదర్, రేపు తీరిగ్గా జలకాలాడుదువుగాని తొందరగా బయటపడు. బావగారొచ్చారు'' అన్నాను. నమాధానం లేదు. బాత్రూం తలుపు తోశాను. లోపల ఎవరూ లేరు.

"తమ్ముడేడీ?'' అంది సిస్టరు నేను హాల్లోకి రాగానే.

"కనిపించడం లేదు. ఎక్కడికెళ్ళాడబ్బా?'' అని తలగోక్కున్నాను.

"ఏవిటి? నా తలగోకుతున్నావు". ఉరిమారు బావగారు.

"మీ తలా? నా తల ఏవైపోయిందా అని కంగారు వడుతున్నాను'' అంటుండగా కరెంటు వచ్చింది.

"వీడు మెంటల్ కేసే'' అంటూ బావగారు తల వట్టుకుని లోపలికి వెళ్ళిపోయారు. భోజనాలయ్యాక, "నాకు ఆరుబయట వక్క వెయ్యి'' అన్నాను సిస్టరుతో. పెరట్లో, చల్లగాలిలో పచార్లు చేస్తూ, "నేనొక పూలమొక్క కడనిల్చి...'' అని అందుకున్నాను. చుట్టువక్కల ఇళ్ళల్లో లైట్లు వెలిగి కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. మన ముఖారవిందం వాళ్ళకి కనిపించకుండానే వెంటనే కరెంటు పోయింది. మళ్ళీ ధన్ ధన్‌మని తలుపులు మూసుకున్నాయి. 'పుష్పవిలాపం', 'ఆంధ్ర పౌరుషం' లాగించి, కొంచెం వార్మ్-అప్ అయ్యాకా జామవా గారి శ్మశానవాటిక అందుకున్నాను. "ఇది పిశాచులతో నిటలేక్షణుండు - గజ్జె కదలించియాడు రంగస్థలంబో.... ఓ... ఓ.... ఓ....''

బావగారు కిటికీ తలుపు విసురుగా తీసి గట్టిగా అరిచారు. "నాలుగు లక్షలు పెట్టి కట్టుకున్న కొంప. పిశాచాలు తిరుగాడే శ్మశానం కాదు. ఇంక నోర్మూసుకు వడుకో...''

బావగారికి కళాత్మక హృదయం లేదు. ఏం చెయ్యను. అందుకని నోరు మూసుకున్నాను కానీ, వడుకోలేదు. అటూ ఇటూ వచార్లు చెయ్యసాగాను. అలా పచార్లు చేస్తుంటే, 'శ్రీ ఆంజనేయం.... ప్రసన్నాంజనేయం' అనుకుంటూ బొండాచారిగారు రోడ్డుమీద కనుపించారు. నక్షత్రాల వెలుగులో ఆకారాన్ని బట్టి ఆయన్ని గుర్తుపట్టి, "ఆచారిగారూ'' అని పిలిచాను.

ఆయన ఉలిక్కిపడి ఎగిరి గంతేసి, రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ, "నన్నొదిలేసే. కావాలంటే మా ఆవిణ్ణి తినేసే'' అని, నాకు తెలుగు అర్థం కాదు అన్నట్లు మళ్ళీ ఇంగ్లీషులో "నన్ను .... లీవ్... ఈట్ మై పెళ్ళాం...'' అన్నారు గజగజ వణకుతూ.

"మిమ్మల్ని తినడవేవిటి. నేను సత్యాన్ని'' అన్నాను.


"నువ్వా - హడలగొట్టి చంపావు కదరా నాయనా. శ్రీ ఆంజనేయం...''

"నేను మీ కళ్ళకి మనుషుల రక్తం తాగే డ్రాక్యులాలా కనిపిస్తున్నానా?'' అన్నాను ఆశ్చర్యపోతూ.

"రజ్జు నర్ప భ్రాంతి నాయనా. లేకపోతే బఫూన్‌ని చూసి నేను భయపడడవేవిటి. వీళ్ళ మొహాలు మండా. ఇంగ్లీషు వాళ్ళు ఏం గొప్పగా తీస్తార్రా హారర్ సినిమాలు.... శ్రీ అంజనేయం.... వెధవది చూడకుండా ఉండలేను. చూస్తే చచ్చే భయం.''

"నేను మా ఇంటికి చేరేదాకా నువ్విక్కడే ఉండరా నాయనా'' అని నన్ను బతిమాలి, 'శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం' అనుకుంటూ, నేను అక్కడ ఉన్నానా లేనా అని అప్పుడప్పుడు వెనక్కు తిరిగి

**బావగారు కిటికీ తలుపు విసురుగా తీసి గట్టిగా అరిచారు. "నాలుగు లక్షలు పెట్టి కట్టుకున్న కొంప - పిశాచాలు తిరుగాడే శ్మశానం కాదు. ఇంక నోర్మూసుకు పడుకో...'' బావగారికి కళాత్మక హృదయం లేదు. ఏం చేయను.**



చూస్తూ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయారు ఆచారిగారు.

ఆయన వెళ్ళిపోయాక ఇంగ్లీషు దయ్యాలు ఆంజనేయస్వామివారిజూరిస్‌డిక్షన్లోకి వస్తాయా రావా అని చిన్న ధర్మ నందేహం వచ్చింది. ఆ నందేహం రాగానే సింగినాదం గుర్తుకొచ్చాడు (వాడి అసలు పేరు సి. గుర్నాధం. వాణ్ణి మేమంతా అభిమానంగా ప్రొ॥ సింగినాదం అని పిల్చుకుంటాం). వాడు క్షుద్రశక్తులు, అతీంద్రియ శక్తులు లాంటి వాటి మీద విస్తృత పరిశోధనలు చేస్తున్నాడు. 'అమెరికన్ దయ్యాలు - ఆంజనేయస్వామి' కేసు వాడిని కలిసినప్పుడు వివరంగా చర్చించాలి అనుకుంటూ మంచం మీద వాలాను. మంచం మీద వడుకుని అలా ఆకాశంలోకి చూస్తుంటే అక్కడ ఏ గ్రహంలోనైనా నాలాంటి జీవులున్నారా అనే నందేహం కలిగింది. నాలాగానే అవతలి గ్రహం వాడు కూడా, వాడి గ్రహంలో వాడి మంచం మీద బబ్బుని, ఇదే నమయంలో నేను అనుకుంటున్నట్లుగా అనుకుంటున్నాడేమో మనం వాడికి ఓ టెలిపతీ నందేశం వంపిస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనొచ్చింది.

సింగినాదం చెప్పినట్లు, కళ్ళు మూసుకుని, మనసు కనుబొమల మధ్య కేంద్రీకరించి, 'హలో బ్రదర్.... హలో.... హలో బ్రదర్' అని నిశ్శబ్దంగా మనసులో అనుకుంటూ ప్రసారం చెయ్యసాగాను.

కొంచెం సేపటికి, "బ్రదర్... బ్రదర్'' అని మెల్లిగా వినిపించింది. 'అరే, అవతలిగ్రహం వాడు మనతో మాట్లాడేస్తున్నాడు' అనుకుని "హలో... హలో... బ్రదర్.... ఏ గ్రహం నుంచి?'' అనడిగాను.

"ఇక్కడ బ్రదర్...'' అని నమాధానం వచ్చింది.

నేను ఉలిక్కిపడి లేచికూర్చుని అటూ ఇటూ చూశాను. వాడితో టెలిపతీ ద్వారా మాట్లాడదామనుకుంటే, వాడు నా కంటే నాలుగాకులు ఎక్కువే చదివి నట్టున్నాడు. డైరెక్టుగా కొంపలోకే దిగిపోయాడు. వాడు అంగుళం సైజులో ఉన్నాడో? అదృశ్యరూపంలో ఉన్నాడో? పిల్లీ, కుక్కా, కిటికీ - ఏ రూపంలో ఉన్నాడో అని మంచం మీంచి దూకి తలగడకింద, మంచం కింద వెతుకుతుంటే "ఇటు బ్రదర్'' అని పిట్టగోడ వైపు నుంచి వినిపించింది. పిట్టగోడ వైపు వెళ్ళి అక్కడ అంతా వెతుకుతుంటే, పిట్టగోడ మీంచి "ఇక్కడ బ్రదర్'' అని వినిపించింది. నేను తలెత్తి చూస్తే గోడ మీద బ్రదర్ ఆకారం కనుపించింది. గ్రహాంతర జీవులు తెలుగు మాట్లాడేస్తాయి; మన రూపాలు కూడా ధరించేస్తాయన్న మాట. ఇది బ్రదర్ వేషంలో వచ్చేసింది.

"ఏవిటి ప్రయాణం బాగా జరిగిందా? బ్రదర్ రూపంలో వచ్చావన్న మాట'' అన్నాను.

"బ్రదర్ రూపంలో రావడవేవిటి! నేను బ్రదర్‌నే బ్రదర్'' అంది పిట్టగోడ దగ్గరున్న ఆకారం టవలు దగ్గరకు లాక్కుని ఎగిరి గోడమీద కూర్చుంటూ

ఇది గ్రహాంతరజీవి కాదు. అచ్చంగా మన బ్రదరే నన్నమాట. గ్రహాంతరజీవి రానందుకు కొంచెం బాధ కలిగినా, బ్రదర్ కనుపించినందుకు చాలా నంతోషం కలిగింది. "బ్రదర్, ఇందాకా ఏమైపోయావు? బట్టలేసుకోకుండా ఇంకా టవలుతోనే తిరుగుతున్నావే'' అన్నాను.

"నువ్వు నా బేగ్ లోపల పెట్టేశావు కదా'' అన్నాడు బ్రదర్ దుఃఖంతో.

"మరి నన్నడగొచ్చుకదా బ్రదర్?''

"అంత టైమ్ లేదు బ్రదర్. నీ మీద ఎవరికీ అనుమానం రాలేదుకదా.''

"బావగారికి నేను పజ్జాలు పాడినందుకు కోపం వచ్చింది. కానీ అనుమానం దేనికి?''

"సిస్టరు చాలా అమాయకురాలు. చాలా మంచిది. నేను బావగారి వైపు నుంచికాక నీలా సిస్టర్ తరవున బంధుత్వం కలుపుకున్నా బావుండేది'' అన్నాడు బ్రదరు నిట్టూరుస్తూ

"స్నానాలకి బయలుదేరిన వాడివి ఏవైపోయావు?''

"అదంతా తర్వాత చెబుతా కానీ, ముందు చచ్చే ఆకలిగా ఉంది. తినడానికేవైనా దొరుకుతుందా?''

"అప్పుడు నాతో భోంచేసెయి బ్రదర్ అంటే సెంటిమెంటన్నావు. ఇప్పుడేమో ఆకలంటున్నావు.''

"ఆకలికి సెంటిమెంటు లేదు బ్రదర్. ఏదో ఒకటి తినకపోతే ప్రాణం పోయేలా ఉంది.''

"సిస్టర్ని లేపుతాను.''

"బావగార్ని మాత్రం లేవకు.''

"ఆయన్ని లేపడవా. ఇప్పుడు లేపితే చంపేస్తారు. నువ్విక్కడే ఉండు'' అంటూ లేచాను.

"నా కోసం అని చెప్పకు. నీ కోసం అని చెప్పు''

"ఓకే బ్రదర్'' అంటూ వెళ్ళి తలుపు తట్టాను. సిస్టరు తలుపుతీసింది.

"సాయంకాలం చేసిన పూరీలు ఉన్నాయా. ఉంటే ఓ అరడజను కూరతో సహా...''

"నీ తిండి మండిపోనూ. చిన్నప్పట్నుంచీ ఏం

**టైగర్‌ను చూడగానే రోడ్డు వైపుకి దూకి కార్టూను ఫిల్ములో కేరక్టరులా పరుగు లంకించుకున్నాడు. నాకు టైగర్‌కి 'ఇతను మన బ్రదర్, టైగర్!' అని చెప్పే అవకాశం కూడా లేకుండాపోయింది.**

మారలేదురా. ఇందాకే పూరీలు తిన్నావు కదా..."


"తిన్నాననుకో - జఠరాగ్ని ప్రకోపించినట్లుంది. చచ్చే ఆకలిగా ఉంది" అన్నాను.

"తిన్నదంతా అరిగిపోయేలా పజ్జాలు పాడితే ఆకలెయ్యదూ. వాడికి పూరీలిచ్చి నాకు అమృతాంజనం తగలెయ్యి", లోపలి నుంచి బావగారి గొంతు కర్కశంగా వినిపించింది.

"బావగారు నిద్రపోలేదా" అనడిగాను.

"ఇప్పుడే నిద్రపోతుంటే మళ్ళా లేపేశావు" అని విసుక్కుంటూ పూరీలు పొట్లం కట్టి, స్టీలు ప్లేటునిండా కూర వేసి అందించింది.

"ఇక తలుపేసుకో" అని సిస్టరుకి చెప్పి, పిట్టగోడ దగ్గరికి వెళ్ళి "బ్రదర్... బ్రదర్" అని పిలిచాను.





"ఇక్కడ" అన్నాడు బ్రదర్ మళ్ళీ గోడెక్కి కూర్చుంటూ. "బావగారికి ఏం కోపం. దూర్వాసమహాముని. ఆయన అరుపు వినిపించగానే హడలిపోయి గోడ మీంచి దూకేశా. నువ్వు అదృష్టవంతుడివి. సిస్టరు అమాయకురాలు కాబట్టి కేటలోపాగా వేశావు" అన్నాడు నిట్టూరుస్తూ, "పనిలో పని. నా బేగ్ తెచ్చెయ్యకపోయావా?" అన్నాడు పూరీలు అందుకుంటూ.

"ముందు చెప్పకపోయావా. ఇప్పుడు మళ్ళీ లేపితే బావగారు నన్ను మర్డరు చేస్తారు."

"ఈ టవలుతో రాత్రంతా గడపనా. నీకసలు బుర్ర లేదు బ్రదర్" అన్నాడు బ్రదర్ చిరాగ్గా, "అసలు అయిదేళ్ళ నుంచీ మన జాతకం బాగోలేదు. చంటాడి మూలాన రాజమండ్రిలో మూడేళ్ళుండి ఇప్పుడే బయటపడ్డాను..."

"చంటాడెవడు బ్రదర్?"

"బిజినెస్ పార్ట్నర్. స్టీలు బీరువాకి, స్టీరియోకి తేడా తెలీని బుర్ర తక్కువ సన్యాసిని పార్ట్నర్‌గా చేసుకోవడం నా తప్పే బ్రదర్."

"ఏం బ్రదర్?"

"స్టీలు బీరువా అనుకుని చంటాడు స్టీరియో తిప్పితే ఏవయింది? పేట పేటంతా సంగీతం గోలతో లేచిపోయింది. మూడేళ్ళు మావగారింట్లో గడపాల్సొచ్చింది."

"స్టీరియో సంగీతానికి, మావగారింటికి లింకేవిటి బ్రదర్?"

"నా తలకాయ బ్రదర్" అన్నాడు బ్రదర్ చిరాగ్గా.

బ్రదర్ ఎందుకో చిరాగ్గా, బాధగా ఉన్నాడని అర్థమైంది.

"నీ బాధ నేను అర్థం చేసుకోగలను బ్రదర్" అన్నాను సానుభూతిగా.

"నువ్వు అర్థం చేసుకోలేవు. ఇంతవరకు పబ్లిక్ ప్రాపర్టీని ప్రైవేటీకరణ చెయ్యడవేకాని అండర్వేరుతో సహా అన్నీ పోగొట్టుకున్న దుస్థితి ఎప్పుడూ రాలేదు. నాకు సైకలాజికల్‌గా తగిలిన దెబ్బ నీకు అర్థం కాదు బ్రదర్. అసలు ఇదంతా నీ మూలంగానే జరిగింది" అని నన్ను నిందించి, "కొంచెం మంచినీళ్ళియ్యి" అన్నాడు పూరీలు తిని కాగితం పడేస్తూ.

గ్లాసుతో మంచి నీళ్ళిచ్చాను. బ్రదర్ నీళ్ళుతాగి, "ఇప్పుడేం చెయ్యను" అన్నాడు.

"ఆ గ్లాసు ఇచ్చేయ్" అన్నాను.

"అరే, గ్లాసు నా దగ్గరే ఉందా" అన్నాడు బ్రదర్, టవలు మడతల్లోంచి గ్లాసు తీసి ఇస్తూ.

రాత్రి పన్నెండు గంటలకి మేమిద్దరం అలా మాట్లాడుకుంటుంటే సీనులోకి టైగర్ ప్రవేశించింది. టైగర్ అంటే పేటకి ఎవరూ నియమించని, సెల్ఫ్ ఎప్పాయింటెడ్ సెక్యూరిటీ ఆఫీసరన్న మాట. రాత్రివేళ దేశసంచారం చేస్తూ, తన రాజ్యంలో శాంతిభద్రతలు చూసుకుంటూ మెల్లిగా పరిగెడుతూ అటు వచ్చింది టైగర్. నన్ను చూసి గుర్తుపట్టి, తోక ఊపి "హలో... హలో" అని పలకరించింది. నేను చెయ్యి ఊపి, "హలో... హలో" అని జవాబు చెప్పబోయేంతలో దాని దృష్టి గోడ మీద కూర్చున్న నల్లటి ఆకారం మీద పడింది. దానికి అనుమానం వచ్చి పరిశోధించడానికి కొంచెం దగ్గరకు వచ్చింది.

టైగర్‌ని చూడగానే బ్రదర్ అనవసరంగా కంగారు పడ్డాడు. గోడకి ఇటువైపు దూకితే అభయహస్తం ఇచ్చి ఆదుకునే వాణ్ణి. బ్రదర్ కంగారుపడి రోడ్డు వైపుకి దూకి, రెండు చేతులతోనూ టవలు జారిపోకుండా పట్టుకుని కార్టూన్ ఫిల్ములో కేరెక్టరులా పరుగులంకించుకున్నాడు. ఇంక నాకు టైగర్‌కి, 'ఇతను మన బ్రదర్, టైగర్!' అని చెప్పే అవకాశం లేకుండాపోయింది.

బ్రదర్ రోడ్డు మీదకు దూకగానే మొదట రెండడుగులు వెనక్కి వేసిన టైగర్, బ్రదర్ పరుగెడుతుంటే ఒక్కక్షణం ఆశ్చర్యపోయింది. అంతలో కర్తవ్యం గుర్తుకొచ్చి, 'భౌ...భౌ...' అని అరుస్తూ వెంటపడింది.

టైగర్ శక్తిసామర్థ్యాల మీద పేటలో అందరికీ విపరీతమైన నమ్మకం. అది కూడా, 'నేనుండగా మీకు భయమేల' అని ఎవరో స్వామీజీ అభయ హస్తం ఇచ్చినట్లు, పేటవాసులకి అభయహస్తం - టైగర్‌కి హస్తం లేదు కదా - అభయతోక ఇచ్చి తిరుగుతూ ఉంటుంది. ఒక మాదిరి కేసులన్నీ ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా తనే పరిష్కరిస్తుంది. అలాంటిది అది అరిచిందంటే అత్యవసర పరిస్థితి ప్రకటించినట్లే.

వెంటనే అన్ని ఇళ్ళల్లోనూ లైట్లు వెలిగాయి. తలుపులు తెరుచుకున్నాయి. చేతికర్రలతో క్షణంలో ఓ వందమంది తయారయ్యి దాని అరుపులు వినిపిస్తున్న దిక్కుకి బేటరీలైట్లు వేసుకుని పరుగెట్టారు. పది, పదిహేను నిమిషాల తర్వాత మెల్లిగా ఒక్కొక్కరే తిరిగి వచ్చారు. టైగర్ కానీ, బ్రదర్‌కానీ వాళ్ళకు కనుపించలేదు.

టైగర్ ఏమైపోయింది అని అందరూ ఆశ్చర్యపోతుంటే మరో అయిదు నిమిషాల తర్వాత ఒక్కతే తిరిగి వచ్చింది. టైగర్ కనుపించగానే గుంపు చప్పట్లు కొట్టి అభినందిస్తూ దారి ఇచ్చింది. అభినందనలు అందుకుంటూ, సైనిక వందనం స్వీకరిస్తున్నట్లు తోక ఎత్తి ఆడిస్తూ గుంపు మధ్య మందగమనంతో పరుగెడుతూ నా ఎదురుగా వచ్చి నిలబడింది టైగర్. దాని నోట్లో విజయకేతనంలా ఎగురుతోంది బ్రదర్ టవలు.

ఆ తర్వాత బ్రదర్ ఏవయ్యాడో ఎవరికీ కనుపించలేదు. యోగి వేమనలా ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో, ఏం కష్టాలు పడుతున్నాడో. బ్రదర్‌ని తల్చుకుంటే నా గుండె కరిగి నీరవుతోంది.

(— సమాప్తం).